పల్లెల్లో వైద్యం అందేనా?

- పూర్తి కాని పల్లె దవాఖానలు
- ఏళ్లు గడుస్తున్న పట్టించుకోని అధికారులు



కుప్పగండ్లలో అసంపూర్తిగా పల్లె దవాఖాన భవనం

వెల్దండ: గ్రామీణ ప్రాంత పేదలకు నాణ్యమైన వైద్యం అందించడానికి పల్లె దవాఖానలను మంజూరు చేసింది. దీంతో ఆయా గ్రామాల్లో నిర్మించే పల్లె దవాఖానలకు నిధులు మంజూరైన నేటికి భవనాలు పూర్తి కాలేదు. దీంతో పల్లె దవాఖానల్లో పేదలకు వైద్యం అందని ద్రాక్షగానే ప్రజలకు మిగిలింది. మండలంలోని కుప్పగండ్ల, కొట్ర, తాండ్ర, బొల్లంపల్లి, బైరాపూర్, చెర్కూర్ గ్రామాకు 2023 సంవత్సరంలో పల్లె దవాఖానలను మంజూరు చేశారు. ఒక్కొక్క భవన నిర్మాణానికి రూ.20 లక్షల చొప్పున నిధులు కేటాయించారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నేటికి పనులు పూర్తి చేయలేదు. కేవలం కొట్ర గ్రామంలో మాత్రమే పనులు పూర్తి చేసి పల్లె దవాఖానను వినియోగంలోకి తీసుకొచ్చారు. చెర్కూర్‌లో భవనం పూర్తి కాకముందే నాయకులు ప్రారంభోత్సవం చేసి వదిలేశారు. మిగిలిన చోట పనులు అసంపూర్తిగా ఉండడంతో పల్లె దవాఖానలో వైద్యం అందించడం ఇబ్బందిగా మారిందని వైద్యులు పేర్కొంటున్నారు.

వైద్యులకు వసతులు లేక..

గ్రామాల్లో పేదలకు మెరుగైన వైద్యం అందించడానికి ప్రభుత్వం పల్లె దవాఖానాలకు ప్రత్యేకంగా వైద్యులు(ఎంఎల్‌హెచ్‌పీ)లను నియమించింది. పల్లె దవాఖానల్లో డాక్టర్‌కు ప్రత్యేక గది, ఏఎస్‌ఎంలకు, ఆశా కార్యకర్తలకు వేర్వేరుగా గదులు ఉంటాయి. అదే విధంగా రోగులకు ప్రత్యేక బెడ్లు ఏర్పాట్లు ఉంటాయి. కానీ పల్లె దవాఖానల్లో వసతులు లేకపోవడంతో పూర్తిస్థాయిలో వైద్యం అందించడం ఇబ్బందిగా మారిందని వైద్యులు పేర్కొంటున్నారు. కుప్పగండ్ల గ్రామంలో భవనం అసంపూర్తిగా ఉండడంతో తాత్కాలికంగా ఆరోగ్య ఉపకేంద్రంలో సేవలందిస్తున్నారు. చెర్కూర్ గ్రామానికి వైద్యులను నియమించలేదు. మందులను భద్రపరచడానికి కూడ వసతులు లేక వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. వర్ష కాలం సమీపిస్తుండడంతో రోగులకు ఇబ్బందుల తప్పవన్నారు. ఉన్నత స్థాయి అధికారులు స్పందించి వెంటనే పనులు పూర్తి చేసి పల్లె దవాఖానలను వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు, నాయకులు కోరుతున్నారు.

భవనాన్ని పూర్తి చేయాలి



పల్లె దవాఖాన భవనాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలి. కుప్పగండ్ల సమీపంలో దాదాపుగా 13 తండాల గిరిజన ప్రజలకు, రెండు గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్యం అందుతోంది. మూడేళ్లుగా గడుస్తున్న భవనం పూర్తి కాలేదు. వైద్యం కోసం కాలినడకన కిలో మీటర్ల దూరం వెళ్తున్నాం.

– రమేష్‌గౌడ్, కుప్పగండ్ల

తాత్కాలిక భవనాల్లో సేవలు



పల్లె దవాఖానల భవనాలు పూర్తి కాలేదు. తాత్కాలికంగా ఆయా గ్రామాల్లోని భవనాల్లో వైద్య సేవలను అందిస్తున్నాం. కుప్పగండ్ల, బొల్లంపల్లి భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయి. కేవలం కొట్రలో మాత్రమే వైద్య సేవలను కొనసాగిస్తున్నాం.

–సింధు, డాక్టర్, వెల్దండ

సీఎం పర్యటన విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం అచ్చంపేట కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏక కాలంలో ఒకేసారి గిరిజనులకు ఆర్‌వోఎఫ్‌ఆర్ చట్టం కింద కేటాయించిన భూములను సాగులోకి తీసుకొచ్చేందుకు, గిరిజనులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. నల్లమల గిరిజనులకు ఇందిరా సౌర గిరి జల వికాసం అనే బృహత్తర పథకం వరంగా మారనుందన్నారు. 18న నల్లమల ప్రాంతంలో రూ.12.60 కోట్లతో ఇందిరా సౌర గిరి జల వికాసం పథకాన్ని సీఎం ప్రారంభిస్తారని తెలిపారు. 2.10 లక్షల మంది గిరిజన రైతులకు 6 లక్షల ఎకరాల భూములకు విద్యుత్, సాగునీరు సౌకర్యం ఏర్పాటు చేసే కార్యక్రమం దేశంలో ఇప్పటివరకు ఏ ప్రభుత్వం కూడా అమలు చేయలేదన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఆదివాసీ గిరిజనుల అభ్యున్నతికి, ఆర్థిక స్వావలంబన పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పథకంను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వంగూరు: మండలంలోని తిరుమలగిరి గ్రామానికి చెందిన ముడావత్ లక్ష్మణ్ అనారోగ్యంతో కొన్ని రోజులుగా బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని బుధవారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పరామర్శించి రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు వెంకటయ్య, కిషన్, గణేష్, రవి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



తాడూరు: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని డీవైఎస్‌ఓ సీతారాం నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని చర్ల ఇటిక్యాలలో జిల్లా క్రీడల యువజన శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ప్రతి రోజు శిక్షణకు హాజరుకావాలని కోరారు. సెల్ఫ్ డిఫెన్స్, కిక్స్ పంచ్‌లు వంటి వాటిపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. విద్యార్థులకు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో కార్యదర్శి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

తూకంలో మోసం



కల్వకుర్తి రూరల్: మండలంలోని తాండ్ర గ్రామం ఓ రేషన్‌దుకాణ డీలర్ తూకంలో మోసం చేస్తున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. బియ్యం తూకం వేసేటప్పుడు కేజీ గన్నీ బ్యాగ్‌తో కాంటా మీద వేసి తూకం వేస్తున్నారని వాపోయారు. మోసానికి పాల్పడుతున్న డీలర్‌పై చర్యలు తీసుకోవాలని రేషన్‌కార్డుదారులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ ఇబ్రహీంను వివరణ కోరగా వినియోగదారులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

స్థానిక సంస్థ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురేద్దాం



కందనూలు: మున్సిపాలిటీ, స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీ జెండా ఎగురేద్దామని నాగర్‌కర్నూలు పట్టణ అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల కమిటీలు, బూతు కమిటీలు, తిరంగా యాత్ర కార్యక్రమం గురించి చర్చించారు. సమావేశంలో ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ అందరి సహకారంతో త్వరలో జరగబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలో సత్తాచాటుదామన్నారు. పట్టణంలోని కార్యకర్తలు అందరం సమన్వయంతో పనిచేసి మున్సిపాలిటీ కైవసం చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ దొడ్ల రాజావర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి, రాము, రాజా రామేశ్వరరావు, బొట్టు శీను తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు సిద్ధం కండి

నాగర్‌కర్నూల్ రూరల్: కనీస వేతనాలు ఉద్యోగ భద్రత పీఎఫ్, ఈఎస్‌ఐ తదితర సౌకర్యాలు కల్పించాలని నాలుగు లేబర్ కోడులకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ఈ నెల 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెకు కార్మికులు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సార్వత్రిక సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. కురుమయ్య, పరశురాములు, వెంకటయ్య, బాలస్వామి, రమేష్, లక్ష్మి, భారతి, పాల్గొన్నారు.

కోడేరు: సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో కరపత్రాలను ఆయన విడుదల చేశారు. రవి, వెంకటయ్య, సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.



కొనసాగుతున్న యువ వికాసం ఇంటర్వ్యూలు



వెల్దండలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న బ్యాంక్ అధికారులు

వెల్దండ: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయా గ్రామాలకు చెందిన నిరుద్యోగులకు రాజీవ్ యువ వికాసం ఇంటర్వ్యూలను నిర్వహించారు. వెల్దండ ఎస్‌బీబీబీఐ, పెద్దాపూర్ కెనరా బ్యాంక్, జూపల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పరిధిలోని గ్రామాల నిరుద్యోగులకు ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన 780 మంది లబ్ధిదారులు హాజరైనట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ లక్ష్మణ్ తెలిపారు.

నేడు పలు గ్రామాల్లో..

మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు గురువారం ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ లక్ష్మణ్ తెలిపారు. మండలంలోని అజిలాపూర్, కుందారంతండా, కొట్ర, రాచూర్, తిమ్మినోనిపల్లి గ్రామాల వారు హాజరుకావాలన్నారు. ఇర్విన్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్, వెల్దండ ఎస్‌బీఐ, కల్వకుర్తి ఎస్‌బీఐ బ్యాంక్ అధికారులు ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు వివరించారు.

నేటి నుంచి కొల్లాపూర్‌లో..

కొల్లాపూర్: రాజీవ్ యువ వికాసం రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న కొల్లాపూర్ మండల పరిధిలోని గ్రామీణ ప్రాంత యువతకు గురువారం నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ వెల్లడించారు. 15 వ తేదీన బీసీ,ఈబీసీ కార్పొరేషన్, 16 వతేదీన ఎస్సీ,ఎస్టీ కార్పొరేషన్, 17వ తేదీన మైనార్టీ, క్రిస్టియన్ కార్పొరేషన్‌లలో రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు దరఖాస్తుదారులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించారు.

‘రైస్ మిల్లర్లతో అధికారులు కుమ్మక్కు’



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

వీపనగండ్ల: రైస్ మిల్లు యజమానులతో కొందరు అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కుమ్మక్కవ్వడం వల్లే ధాన్యం కొనుగోలులో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి మేకల ఆంజనేయులు అన్నారు. బుధవారం తూంకుంట వరి కొనుగోలు కేంద్రాన్ని రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. రైతులను గందరగోళానికి గురిచేసే విధంగా తాలు, మట్టి పెళ్లల పేరుతో రైస్‌మిల్లర్లు తరుగు తీస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. మిల్లర్లకు నష్టం వస్తుందని రైతుల వద్ద వాదిస్తూ నిబంధనలకు విరుద్ధంగా క్వింటాల్‌కు 4 కేజీలు అధికంగా ఇవ్వాలని కొనుగోలు సిబ్బంది చెప్పడం అన్యాయం అన్నారు. క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారులు వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతు సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే జిల్లా వ్యాప్తంగా రైతులను సమీకరించి ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో గీతాకార్మిక సంఘం జిల్లా నాయకులు రామచంద్రయ్యగౌడ్, సిఐటియు నాయకులు బాలకృష్ణాచారి పలువురు రైతులు పాల్గొన్నారు.

వినాయకుడి ఆలయం ప్రారంభోత్సవం

చిన్నంబావి: మండలంలోని పెద్దమారులో వినాయకుడి ఆలయం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ ప్రతిష్ఠాపనోత్సవానికి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం నిర్మాణం కోసం సహకరించిన గ్రామస్తులు శ్రీనివాస్‌రావు, చుక్కరావు ను మంత్రి శాలువాతో సత్కరించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు..

ధాన్యం సేకరణలో జాప్యం చేయొద్దు



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

నాగర్‌కర్నూల్: రైతుల నుంచి వరిధాన్యం సేకరణలో జాప్యం చేయొద్దని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. నాగర్‌కర్నూల్ మండలం వనపట్ల గ్రామంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతుల నుంచి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం, మిల్లులకు తరలించిన ధాన్యం వివరాలను తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని రైతులతో ఆరా తీశారు. అయితే వనపట్లలో ధాన్యం సేకరణలో కొంత జాప్యం జరుగుతుందని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. జిల్లా యంత్రాంగం అన్ని సదుపాయాలు సమకూరుస్తున్నప్పటికీ ధాన్యం సేకరణలో ఎందుకు జాప్యం చేస్తున్నారని కేంద్రం నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కొనుగోలులో నిర్లక్ష్యానికి తావిచ్చే సొసైటీలకు వచ్చే సీజన్‌లో కేంద్రాలను కేటాయించకూడదని పౌరసరఫరాల శాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు ఇబ్బందులు పడకూడదని, కేంద్రాలకు ధాన్యం తెచ్చిన వెంటనే నాణ్యాతా ప్రమాణాలను పరిశీలించి తూకం వేయాలని నిర్వాహకులను ఆదేశించారు.

వధువుకు ఆర్థికసాయం



తిమ్మాజిపేట: మండలంలోని చేగుంటలో వధువుకు ఎంఎస్‌ఆర్ ట్రస్టు అధినేత మారేపల్లి సురేందర్‌రెడ్డి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. పెళ్లికూతురు కుటుంబ సభ్యులు, ట్రస్టు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు మాజీ ఎంపీటీసీ మిల్లె మల్లయ్య, గడ్డం చెన్నయ్య, వెంకట్‌రెడ్డి, గోసుల శ్రీశైలం, నర్సింహులు, స్వామి, బాలకృష్ణారెడ్డి, శంకర్‌లు పాల్గొన్నారు.

బాధితుడికి ఫోన్ అప్పగింత



చారకొండ: చోరీకి ఫోన్‌ను బుధవారం బాధితుడికి పోలీసులకు అప్పగించారు. ఎస్‌ఐ శంషోద్దీన్ వివరాల ప్రకారం ఏప్రిల్‌లో సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి ఉత్సవాల్లో హైదరాబాద్ నారాయణగూడకు చెందిన సాయిబాబు సెల్‌ఫోన్ చోరీకి గురైంది. బాధితుడు సీఈఐఆర్ యాప్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. ఈ మేరకు సైబర్ వారియర్ కానిస్టేబుల్ ఆంజనేయులు సహకారంతో ఫోన్ రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో బాధితుడికి ఫోన్ అప్పగించారు. ఏఎస్‌ఐ అంజయ్య, కానిస్టేబుల్ రవి తదితరులు ఉన్నారు.

డ్రైవర్‌పై కేసు నమోదు

తిమ్మాజిపేట: మండలంలోని మరికల్ కోళ్ల ఫామ్ సమీపంలో ఆటో బోల్తా పడిన ఘటనలో డ్రైవర్‌పై కేసు నమోదైంది. ఏఎస్‌ఐ ప్రిసిల్లా వివరాల ప్రకారం మామిడి చెట్ల తండాకు చెందిన షేమ్లీ కూరగాయాల కోసం 10న జడ్చర్ల వైపు వెళ్తున్న ఆటో ఎక్కింది. మార్గమధ్యలో ఆటో బోల్తాపడటంతో మహిళ షేమ్లీకి గాయాలయ్యాయి. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

మహాసభలను విజయవంతం చేయాలి



తెలకపల్లి: అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 17వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో మహాసభల వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ మహాసభలు ఈ నెల17, 18వ తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతిలో 17 రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాల నుంచి ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రవీందర్, రైతు జిల్లా కార్యదర్శి శంకర్‌గౌడ్, నాయకులు నాగేషు,రాము, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



ఊర్కొండ: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. బుధవారం మండలంలోని నర్సంపల్లి, ఊర్కొండపేట నర్సరీలను ఆయన సందర్శించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ వనమహోత్సవంలో భాగంగా వచ్చే రెండేళ్లకు మండలానికి 41670 మొక్కలు నాటేందుకు లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు. ఏపీఓ నర్సింహ, పంచాయతీ కార్యదర్శులు ఇబ్రహీం, మంజుల, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

పాముల సయ్యాట



వెల్దండ: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం పాములు మేల వేసుకొన్నాయి. కార్యాలయ సిబ్బంది, ప్రజలు భయాందోళన గురయ్యారు. అక్కడ ఉన్నవారు కొందరు పాముల సయ్యాటను ఫోన్లలో బంధించారు. కొంత సమయానికి సమీపంలోని రాళ్లలోకి వెళ్లడంతో ఊపిరిపీల్చుకున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కల్వకుర్తి రూరల్: చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందినట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని తాండ్ర శివారులో ఉన్న ఓ వెంచర్ వద్ద ఈ నెల 7న ఓ వృద్ధుడు (సుమారు 62 ఏళ్లు) పడి ఉండటాన్ని గ్రామ కార్యదర్శి గుర్తించి వెంటనే అంబులెన్స్‌లో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 12న అర్ధరాత్రి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారన్నారు. గ్రామ కార్యదర్శి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు. మరిన్ని వివరాలకు సెల్‌నంబర్ 87126 57752 సంప్రదించాలని ఎస్‌ఐ సూచించారు.

సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి



పాన్‌గల్: చిన్నారులకు, గర్భిణులకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయించడంతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని సీహెచ్‌ఓ రామయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సబ్‌సెంటర్‌ను ఆయన సందర్శించి వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. టీకాలు వేయించుకోవడంతో అంటువ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని, పౌష్టికాహారం తదితర అంశాలపై గర్భిణులు, చిన్నారుల తల్లులకు అవగాహన కల్పించారు. వ్యాధి నిరోధక టీకాలు, గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం, మొదటి, రెండో డోస్ టీడీ వాక్సిన్‌పై అవగాహన కల్పించాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఏ వ్యాక్సిన్‌తో ఏ రోగం తగ్గుతుంది అని తెలుసుకోవడానికి మాతా శిశు సంరక్షణ కార్డు (ఎంసీహెచ్) వ్యాక్సినేషన్ పుస్తకం చదివితే తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ నర్సమ్మ, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శాంతిభద్రతలకు ప్రాధాన్యం

తిమ్మాజిపేట: శాంతి భద్రతలకు ప్రాధాన్యం ఇస్తానని ఎస్‌ఐ సీహెచ్ హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. శాంతికి విఘాతం కల్గించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. బాలికలను, మహిళలను వేధిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. గంజాయి, మత్తు పదార్థాలకు చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం ఇటీవల ఎస్‌ఐ బాధ్యతలు స్వీకరించడంతో పలు పార్టీల నాయకులు శాలువాలతో సన్మానించారు.

సమస్యలు పరిష్కరించాలి

ఉప్పునుంతల: జాతీయ ఉపాధిహామీ పథకంలో పనులు చేపడుతున్న కూలీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి చింతల నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని తిప్పాపూర్‌లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను ఆయన కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కూలీలకు పెండింగ్‌లో ఉంచిన బిల్లులను వెంటనే చెల్లించి చట్టంలో రూపొందించిన విధంగా కూలీ డబ్బులు సకాలంలో అందజేయాలన్నారు. అదేవిధంగా పనుల వద్ద కూలీలకు మౌలిక వసతులు కల్పించడంతోపాటు ఏడాదికి 200ల పనిదినాలను కల్పిస్తూ రోజువారి కూలీ రూ. 600 ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృత్యువాత

తెలకపల్లి: విద్యుదాఘాతంతో ఎద్దు మృత్యువాత చెందిన ఘటన బుధవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిన్నముద్దునురు గ్రామ సమీపంలో జనంపల్లి నరేందర్‌రెడ్డికి సంబంధించిన ఎద్దు ప్రమాదవశాత్తు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలింది. విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు విలువ రూ.80 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

మజ్జిగ పంపిణీ



కల్వకుర్తి రూరల్: ఆర్ట్ ఆఫ్ లివింగ్ రాష్ట్ర కోఆర్డినేటర్ శివకుమార్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద సేవ బృందం సహకారంతో పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో స్థానికులకు బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ నైబర్‌గుడ్ అనే నినాదంతో ప్రొఫెసర్ అచ్యుత్ సమంత పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సమాజంలోని పేద, మధ్య తరగతి ప్రజలకు సేవ చేయడం, యువత సేవా కార్యక్రమాలు చేపట్టేలా ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, ఆంజనేయులు, నరసింహ, శివరామకృష్ణ, సాయికుమార్, లక్ష్మీనరసింహ, మణిదీప్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొల్లాపూర్ రూరల్: మండలంలోని కొల్లాపూర్, ఎల్లూరు సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న కొల్లాపూర్, రామాపురం, సోమశిల, బోయలపల్లి, మాచినేనిపల్లి, ఎల్లూరు, అమరగిరి, పెంట్లవెల్లి మండలంలోని పెంట్లవెల్లి, మల్లేశ్వరం, మంచాలకట్ట, ఎంగంపల్లి, మాధవస్వామి నగర్ గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తునట్లు ఏఈ ఉమేష్ గౌడ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 33 కేవీ కొల్లాపూర్ లైన్‌కు తగులుతున్న చెట్ల కొమ్మలను తొలగిస్తునట్లు వివరించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కందనూలు: నాగర్‌కర్నూల్ పరిధిలోని కొల్లాపూర్ చౌరస్తాలో గల సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం సాయంత్రం 5:00 గంటల నుంచి 6:00 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏడీఈ శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో మంతటి చౌరస్తా, కొల్లాపూర్ చౌరస్తా, పెద్ద ముద్దునూరు, దేశిటిక్యాల, వనపట్ల, గన్యాగులలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తునట్లు పేర్కొన్నారు.

కరపత్రాలు విడుదల

కొల్లాపూర్ రూరల్: మండలంలోని మొలచింతలపల్లిలో ఈ నెల 18న కొల్లాపూర్ మండల స్థాయి మహాసభలు నిర్వహిస్తున్నట్లు నియోజక వర్గ సీపీఐ కార్యదర్శి ఎస్‌ఎండీ ఫయాజ్ అన్నారు. బుధవారం మండలంలోని కుడికిల్లలో బుధవారం సీపీఐ నాయకులు గ్రామ మహాసభలు నిర్వహించారు. మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి తుమ్మల శివుడు, నాయకులు తిరుపతయ్య, బాలపీరు, రాజులు, తదితరులు పాల్గొన్నారు.